



# కలం కౌంటర్

KALAM COUNTER TELUGU DAILY

తెలుగు దినపత్రిక

సంపుటి : 9 సంచిక : 42

పేజీలు : 4 వెల రూ.4/-

Circulated by : Krishna, Guntur, Prakasam, Nellore, West Godavari, Khammam, Hyderabad, Chittor

గురువారం 19 జూన్ 2025


## పన్నుల వసూళ్లలో అవగాహన కల్పించండి..

# వేధింపులు వద్దు..

- వ్యవస్థలో లొసుగులు వాడుకుని రెవెన్యూకు గండి కొడితే కఠిన చర్యలు
- రెవెన్యూ, రిజిష్ట్రేషన్ల సేవలు యూజర్ ఫ్రెండ్లీగా ఉండాలి
- ఆదాయార్జనకు కొత్త మార్గాలు అన్వేషించండి
- ఆదాయార్జన శాఖల సమీక్షలో ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు



**అమరావతి,కలంకౌంటర్ :** రాష్ట్రంలో వ్యాపారం చేసి పన్నులు ఎగవేద్దామని అనుకుంటే ఇక కుదరదని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు స్పష్టం చేశారు. పన్నుల ఎగవేతకు దారులు మూసేయాలని అధికారులను ఆదేశించారు. వ్యవస్థలో లొసుగులను వాడుకుని ప్రభుత్వ ఆదాయానికి నష్టం కలిగించేందుకు ప్రయత్నిస్తే కఠినంగా వ్యవహరిస్తామని తేల్చి చెప్పారు. సచివాలయంలో ఆదాయార్జన శాఖలపై నిర్వహించిన సమీక్షలో ముఖ్యమంత్రి చంద్రబాబు అధికారులకు రెవెన్యూ లక్ష్యాలకు సంబంధించి ముఖ్యమైన సూచనలు చేశారు. అదే సమయంలో పన్ను వసూళ్లలో వ్యాపారులు, పన్ను చెల్లింపుదారులను ఇబ్బందులకు గురి చేయొద్దని స్పష్టం చేశారు. పన్ను వసూళ్లకు సంబంధించి వారిలో అవగాహన కల్పించాలని ముఖ్యమంత్రి ఆదేశించారు. పన్ను చెల్లింపులకు సంబంధించి 2017 నుంచి ఉన్న సమాచారాన్ని విశ్లేషించాలని సీఎం సూచించారు. ఎగవేత దారులకు ప్రభుత్వం ఇచ్చే ప్రోత్సాహకాల గురించి కూడా పునరాలోచన చేస్తామని ముఖ్యమంత్రి స్పష్టం చేశారు. మరోవైపు ప్రభుత్వ శాఖలు చేసే పన్ను వసూళ్లకు సంబంధించి ప్రజల నుంచి అభిప్రాయ సేకరణ కూడా చేస్తామని సీఎం చెప్పారు. ప్రజల నుంచి సంతృప్తి వ్యక్తం కావటమే కూటమి ప్రభుత్వానికి ముఖ్యమన్నారు. మరోవైపు 2025-26 ఆర్థిక సంవత్సరానికి రూ.1.24 లక్షల కోట్ల మేర ఆదాయం వస్తుందని అంచనా వేస్తున్నట్టు అధికారులు ముఖ్యమంత్రికి తెలిపారు. ఆదాయాన్ని పెంచుకోగలిగితే అభివృద్ధి, సంక్షేమాన్ని మరింత చేయగలుగుతామని సీఎం చంద్రబాబు చెప్పారు. మరోవైపు రాష్ట్రవ్యాప్తంగా జీఎస్టీ, సహా వాణిజ్య పన్నుల వసూళ్లకు సంబంధించి ఆయా జిల్లాల జాయింట్ కమిషనర్లతో ముఖ్యమంత్రి వీడియో కాన్ఫరెన్సు ద్వారా మాట్లాడారు. పన్ను వసూళ్లలో మెరుగైన ఫలితాలు సాధించటంపై చిత్తూరు, కర్నూలు, కాకినాడ, అనంతపురం, నెల్లూరు జిల్లాలకు చెందిన వాణిజ్య పన్నుల శాఖ జాయింట్ కమిషనర్లను సీఎం అభినందించారు. ప్రస్తుతం రాష్ట్రం ఆర్థికంగా ఇబ్బందికర పరిస్థితుల్లో ఉందని గత ప్రభుత్వ హయాంలో జరిగిన తప్పులను సరిచేస్తేనే సమస్యలు తొలగుతాయని ముఖ్యమంత్రి అన్నారు. ఈ ప్రక్రియ జరగకపోతే రాష్ట్ర ఆర్థిక పరిస్థితి శాశ్వతంగా ఇబ్బందుల్లో పడుతుందని చెప్పారు. విశాఖ, విజయవాడ లాంటి నగరాల నుంచి రాష్ట్ర ఆదాయానికి తోడ్పడేలా రెవెన్యూ ఆర్జన పెరిగేలా చూడాలని చంద్రబాబు సూచించారు.

**పెరిగిన రెవెన్యూ కలెక్షన్లు ..** గతేడాదితో పోలిస్తే రెవెన్యూ వసూళ్లు పెరిగాయని అధికారులు ముఖ్యమంత్రికి వివరించారు. స్టాంపులు రిజిస్ట్రేషన్ల శాఖలో 2025 ఏప్రిల్ నెలలో రూ. 906.12 కోట్లు, మే నెలలో రూ.916 కోట్ల మేర వసూళ్లు అయ్యాయని అధికారులు వివరించారు. గతేడాది ఇదే సమయానికి ఏప్రిల్ నెలలో రూ. 663.29 కోట్లు, మే నెలలో రూ.583 కోట్ల మేర ఉన్నట్టు అధికారులు సీఎంకు తెలిపారు. రాష్ట్రంలో జీఎస్టీ ఆదాయం క్రమంగా పెరుగుతున్నట్టు అధికారులు ముఖ్యమంత్రికి వివరించారు. జీఎస్టీ, వాణిజ్య పన్నుల రాబడి 5.71 శాతం మేర పెరిగాయని స్పష్టం చేశారు. జీఎస్టీ, వాణిజ్య పన్నులకు సంబంధించి ఈ ఆర్థిక సంవత్సరానికి రూ. 43,020 కోట్ల మేరకు వసూళ్లు లక్ష్యంగా పెట్టుకున్నామని తెలిపారు. నూతన మద్యం విధానం ద్వారా వ్యవస్థను పటిష్టం చేయాలని ముఖ్యమంత్రి అధికారులను ఆదేశించారు. నూతన మద్య విధానం అమలు అనంతరం రాష్ట్రానికి రూ.2,432 కోట్ల మేర ఆదాయం పెరగనున్నట్టు సీఎంకు అధికారులు వివరించారు. గనుల శాఖలో మెరుగైన ఫలితాలు సాధించేందుకు ఉపగ్రహ సమాచారాన్ని అను- సంధానం చేయాలని ముఖ్యమంత్రి ఆదేశించారు. ఖనిజాలు, ఇసుక తవ్వకాలకు సంబంధించి ఖచ్చితమైన డేటాను సేకరించడంతో పాటు ఆదాయం ఆర్జించేందుకు సాంకేతికతను వినియోగించుకోవాలని సీఎం సూచించారు. తద్వారా 30 నుంచి 40 శాతం మేర అదనంగా ఆదాయాలు పెంచుకోవచ్చని ముఖ్యమంత్రి చంద్రబాబు అధికారులకు దిశా నిర్దేశం చేశారు. మరోవైపు రాష్ట్రంలో అటవీశాఖ ఆధీనంలో ఉన్న ఎర్ర చందనం విక్రయానికి సంబంధించి అంతర్జాతీయంగా ఉన్న ధరల్ని బేరీజు వేయాల్సిందిగా ముఖ్యమంత్రి ఆదేశాలు జారీ చేశారు.

**పనితీరు, ప్రతిభ ఆధారంగానే పోస్టింగులు ..** ఆదాయార్జనలో కీలకమైన శాఖలు, విభాగాల్లో ఉత్తమ ప్రతిభ కనబరిచే అధికారులను నియమించాలని ముఖ్యమంత్రి ఆదేశించారు. సరైన వ్యక్తులు సరైన చోట్ల ఉంటేనే మెరుగైన ఫలితాలను సాధించగలుగుతామని ఆయన అన్నారు. ప్రభుత్వ లక్ష్యాలను సాధించగలిగిన వారు సరైన స్థానాల్లో ఉండాలని స్పష్టం చేశారు. దీనిపై కసరత్తు చేయాల్సిందిగా సీఎం ఆదేశించారు. రెవెన్యూ, రిజిస్ట్రేషన్ల శాఖకు సంబంధించిన సేవలు మరింత యూజర్ ఫ్రెండ్లీగా ఉండాలని ముఖ్యమంత్రి సూచించారు. అలాగే ఆదాయార్జనకు కొత్త మార్గాలను అన్వేషించాలని సీఎం స్పష్టం చేశారు.

## పల్నాడు జిల్లా రెంటపాళ్లలో మాజీ సీఎం జగన్ పర్యటన



**పల్నాడు జిల్లా,కలంకౌంటర్ :** రాష్ట్రంలో నెలకొన్న పరిస్థితులు దారుణంగా ఉన్నాయని, పల్నాడు జిల్లా, సత్తెనపల్లి మండలం, రెంటపాళ్ల గ్రామానికి చెందిన కోర్లకుంట వెంకటేశ్వరరావు కుటుంబానికి జరిగిన అన్యాయమే దీనికి నిదర్శనమని వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అధినేత, మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆవేదన వ్యక్తం చేశారు. బుధవారం ఆయన రెంటపాళ్లలో పర్యటించి, ఆత్మహత్యకు పాల్పడిన నాగమల్లేశ్వరరావు కుటుంబ సభ్యులను పరామర్శించారు. అంతకుముందు నాగమల్లేశ్వరరావు విగ్రహాన్ని ఆవిష్కరించిన అనంతరం జగన్ మీడియాతో మాట్లాడారు.

**"పోలీసు వేధింపులతోనే ఆత్మహత్య"** గత ఏడాది అసెంబ్లీ ఎన్నికల కౌంటింగ్ రోజున రెంటపాళ్ల ఉపసర్పంచ్‌గా ఉన్న నాగమల్లేశ్వరరావుపై తెలుగుదేశం, జనసేన నాయకులు తప్పుడు ఆరోపణలు చేశారని జగన్ ఆరోపించారు. ఆ ఆరోపణలతో పోలీసులు ఆయనను పోలీస్ స్టేషన్‌కు తీసుకెళ్లి తీవ్రంగా అవమానించారని అన్నారు. ఎన్నికల్లో కూటమికి అనుకూల ఫలితాలు వచ్చిన తర్వాత నాగమల్లేశ్వరరావు ఇంటిపై దాడులు చేసి, ఊరు విడిచి వెళ్లిపోవాలని, లేకపోతే రౌడీ షీట్ తెరుస్తామని స్వయంగా సీఐ బెదిరించారని ఆవేదన వ్యక్తం చేశారు. "జూన్ 5వ తేదీ రాత్రి పోలీసులు నాగమల్లేశ్వరరావును వదిలిపెట్టగా,

- 2లో

## యోగాంధ్రతో పలు ప్రపంచ రికార్డులు సాధించి

### ఎ.పి.ని దేశంలో మొదటి స్థానంలో నిలపాలి : సిఎస్. కే విజయానంద్



**అమరావతి,కలంకౌంటర్ :** ఈనెల 21వ తేదీన అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని విశాఖ పట్నం కేంద్రంగా,రాష్ట్ర వ్యాప్తంగా నిర్వహించ నున్న యోగాంధ్ర కార్యక్రమం ద్వారా పలు ప్రపంచ రికార్డులు సాధించడం తోపాటు ఎపిని దేశంలో మొదటి స్థానంలో నిలిపేందుకు అన్ని ప్రయత్నాలు చేయాలని ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె.విజయానంద్ అధికారులను ఆదేశించారు. యోగాంధ్ర కార్యక్రమంపై బుధవారం రాష్ట్ర సచివాలయం నుండి ఆయన సంబంధిత శాఖల కార్యదర్శులు,జిల్లా కలెక్టర్లతో వీడియో సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈకార్యక్రమం నిర్వహణకు సంబంధించి ఇప్పటికే దాదాపు ఏర్పాట్లన్నీ పూర్తి కావచ్చాయని రానున్న మూడు రోజులు నిరంతరం కృషి చేసి ఈకార్యక్రమాన్ని పూర్తిగా విజయంతం చేసేలా అన్ని శాఖల అధికారులు పని చేయాలని సూచించారు.ముఖ్యంగా అధిక సంఖ్యలో యోగా కార్యక్రమంలో పాల్గోవడం,ఎక్కువ వేదికల్లో యోగాను నిర్వహించడంలోను,సర్టిఫికెట్ల జారీ వంటి పలు అంశాల్లో వీలైనన్నిఎక్కువ ప్రపంచ రికార్డులు సాధించి యోగాలో దేశంలో ఆంధ్రప్ర దేశ్ ను మొదటి స్థానంలో నిలపేందుకు ప్రతి ఒక్క రూ కృషి చేయాలని సిఎస్ విజయానంద్ పునరు ద్ఘాటించారు. ఈనెల 21వ తేదీన అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని పురస్కరించుకుని విశాఖ పట్నంలో జరిగే ప్రధాన ఈవెంట్ తో అనుసంధానిస్తూ యోగా ప్రోటోకాల్ పాటిస్తూ ప్రతి జిల్లా కేంద్రంలో కనీసం 5000 మందితో ఒక ప్రధాన యోగా ఈవెంట్ ను నిర్వహిం చడంతో పాటు గ్రామ స్థాయి వరకూ వివిధ వేదికల్లో యోగాను నిర్వహించేలా చూడాలని జిల్లా కలక్టర్లను సిఎస్ విజయానంద్ ఆదేశించారు.రాష్ట్ర వ్యాప్తంగా లక్షా 50 వేలకు పైగా వేదికల్లో ఈయో గాంధ్ర కార్యక్రమాన్ని నిర్వహించేందుకు చర్యలు తీసుకుంటుండగా ఇప్పటికే లక్షా 28 వేల వేదికలు రిజిష్టర్ అయినట్టు తెలిపారు.ఈ కార్యక్రమంలో 2 కోట్ల మందికి పైగా పౌరులు పాల్గొనేలా ప్రభుత్వం లక్ష్యంగా నిర్ణయించిందని ఆదిశగా తగిన ఏర్పాట్లు అన్ని పూర్తి కావచ్చాయని చెప్పారు. ఈ వేదికల్లో పబ్లిక్ అడ్రస్ సిస్టమ్, లైవ్ స్క్రీనింగ్,తాగునీరు వంటి ఏర్పాట్లు కల్పించేందుకు కలక్టర్లు ప్రత్యేక చర్యలు తీసుకోవాలని సూచించారు.ఈకార్యక్రమంలో పాల్గొనేవారి సంఖ్యతో పాటు ఫోటోలను ఇన్‌ఛార్జ్ లాగిన్‌లో అప్‌లోడ్ చేయాలని,ఈవెంట్‌లో పాల్గొనే అన్ని వేదికల్లో డేటా ఎంట్రీ సరిగ్గా జరిగేలా జాగ్రత్త తీసుకోవాలని అప్పుడే ప్రపంచ రికార్డులు సాధించేందుకు అవకాశం ఉంటుందని సిఎస్ తెలిపారు. వరసగా మూడు రోజలపాటు యోగాసనాల్లో పాల్గొన్న వారికి ఆన్లైన్ ద్వారా సర్టిఫికెట్లు జారీపై జిల్లా కలెక్టర్లందరూ ప్రత్యేక దృష్టి పెట్టి ఈనెల 19వతేదీకి ఆప్రక్రియను పూర్తి చేయాలని సిఎస్ విజయానంద్ ఆదేశించారు.మాస్టర్ ట్రైనర్లకు సర్టిఫికెట్లు నేషనల్ ఇన్స్టిట్యూట్ ఆఫ్ యోగా నుండి జారీ చేయబడతాయని వాటని డౌన్‌లోడ్ చేసుకోవాలని మాస్టర్ ట్రైనర్లకు చెప్పాలన్నారు.అంతర్జాతీయ యోగా దినోత్సవానికి సంబంధించి రాష్ట్ర స్థాయి పోటీలను ఇప్పటికే పూర్తి చేశామని వాటిలో గెలుపొందిన విజేతలను అంతర్జాతీయ యోగా దినోత్సవ వేడుకల్లో పాల్గొనేందుకు ఈనెల 20వతేదికి వారిని విశాఖపట్నం తీసుకురావడానికి అందరు జిల్లా కలక్టర్లు తగిన ఏర్పాట్లు చేయాలని ఇందుకై ప్రత్యేకంగా ఒక ఇన్చార్జిని ఏర్పాటు చేయాలని చెప్పారు.అన్నిపాఠశాలలు కళాశాలలు మరియు ఇతర సంస్థలను యోగా నిర్వహణ వేదికలుగా నమోదు చేయాలని విద్యాశాఖ అధికారులను ఆదేశించారు.రానున్న మూడు రోజుల్లో అన్నివిద్యా సంస్థల విద్యార్థులు అందరికీ యోగా ప్రదర్శనలు మరియు తరగతులు నిర్వహించాలన్నారు.







# ప్రతి క్షణం అప్రమత్తం అవసరం - ఎస్పీ వకుల్ జిందాల్





**విజయనగరం,కలంకౌంటర్ :** ఈ నెల 21న విశాఖ సముద్ర తీరంలో జరగనున్న యోగాంధ్ర కార్యక్రమంలో దేశ ప్రధానమంత్రి నరేంద్ర మోదీ , ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు , పెద్ద సంఖ్యలో ప్రజలు పాల్గొననున్న నేపథ్యంలో ఏర్పాటు చేసిన బందోబస్తు, భద్రత విధుల్లో పాల్గొననున్న పోలీసు అధికారులు, సిబ్బంది నిర్వహించాల్సిన విధులు గురించి విజయనగరం జిల్లా ఎస్పీ వకుల్ జిందల్ జూన్ 18న విశాఖ సిటీ రుషికొండ వద్ద A1 ఫంక్షన్ హాలు వద్ద దిశా నిర్దేశం చేశారు. ఈ కార్యక్రమంలో ఎఆర్ ఎస్పీ అశోక్ కుమార్ , అదనపు ఎస్పీ పి.సౌమ్యలత , జి.నాగేశ్వరరావు , పలువురు డీఎస్పీలు, సిఐలు, ఎస్సైలు, ఇతర పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

# దివిసీమ ఉప్పెన సహాయక చర్యల్లో ప్రభాకర్ జీ పాత్ర మరువలేనిది

● గాంధీ క్షేత్రంలో ఘనంగా ప్రభాకర్ జీ వర్ధంతి



**అవనిగడ్డ,కలంకౌంటర్ :** దివిసీమ ఉప్పెన సహాయక చర్యల్లో ప్రభాకర్ జీ పాత్ర మరువలేనిది అని అవనిగడ్డ ఎమ్మెల్యే మండలి బుద్ధప్రసాద్ అన్నారు. బుధవారం అవనిగడ్డ గాంధీక్షేత్రంలో సర్వోదయ నాయకుడు, మహాత్మాగాంధీ అనుచరుడు ప్రభాకర్ జీ వర్ధంతి కార్యక్రమం గాంధీ క్షేత్రం కమిటీ ఆధ్వర్యంలో నిర్వహించారు. గాంధీ క్షేత్రం ఆవరణలోని ప్రభాకర్ జీ విగ్రహానికి ఎమ్మెల్యే బుద్ధప్రసాద్ పూలమాల వేసి ఘనంగా నివాళులు అర్పించారు. మౌనం పాటించి శ్రద్ధాంజలి ఘటించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 1977లో దివిసీమ ఉప్పెన విషాద ఘటన సంభవించిన సమయంలో ఉప్పెన ప్రభావిత దివిసీమ గ్రామాలన్నీ వేలాది మృతదేహాలతో నిండి ఉన్న దశలో మృతుల సామూహిక అంత్యక్రియల నిర్వహణకు శవ సేన స్థాపించి ప్రభాకర్ జీ చేసిన సేవ చిరస్మరణీయం అన్నారు. అవనిగడ్డలో గాంధీ క్షేత్రం అధ్యక్షునిగా ప్రభాకర్ జీ చేసిన సేవలు చిరస్మరణీయమన్నారు. కార్యక్రమంలో నియోజకవర్గ యువనాయకులు మండలి వెంకట్రామ్, గాంధీ క్షేత్రం ప్రధాన కార్యదర్శి మత్తి శ్రీనివాసరావు, దివిసీమ లలిత కళా సమితి ప్రధాన కార్యదర్శి కూనపరెడ్డి చంద్రశేఖర్, ఏఎంసీ చైర్మన్ కొల్లూరి వెంకటేశ్వరరావు, టీడీపీ మండల అధ్యక్షులు యాసం చిట్టిబాబు, డీసీ వైస్ చైర్మన్ బచ్చు రఘునాథ్ ప్రసాద్, మాజీ ఎంపీపీ బండే కనకదుర్గ, ఎంపీటీసీ బొప్పన భాను, టీసీ రేపల్లె రవీంద్ర, కూటమి నాయకులు సిద్దినేని అశోక్ నాయుడు, బచ్చు శ్రీహరి, బండే రాఘవ, బచ్చు వెంకట్ నాథ్ ప్రసాద్, విశ్వనాధుని మురళీ మోహన్, గుడివాక శివరావు, మండలి శేషు, చందన నరసింహారావు, షేక్ మొగల్ మురాద్ బేగ్, విశ్వనాథపల్లి పాప, యలవర్తి ఆది, దుట్టా మోహన శివ రాజయ్య, అన్నపరెడ్డి రాందాస్, లుక్కా వెంకట పిచ్చియ్య, కూటమి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# బ్రహ్మోత్సవాల గోడ పత్రిక ఆవిష్కరించిన ఎం ఎల్ ఏ



**శ్రీకాళహస్తి,కలంకౌంటర్ :** శ్రీకాళహస్తీశ్వర స్వామి వారి దేవస్థానం అనుబంధ ఆలయమైన ద్రౌపతి సమేత ధర్మరాజు స్వామి వారి బ్రహ్మోత్సవాల గోడ పత్రిక ఆవిష్కరణ చేసిన శ్రీకాళహస్తి శాసనసభ్యులు బొజ్జల సుధీర్ రెడ్డి , ఆలయ ఈఓ బాపిరెడ్డి .

# రోడ్డు ప్రమాదంలో పులిగడ్డ వాసి మృతి

**అవనిగడ్డ,కలంకౌంటర్ :** చల్లపల్లి మండలం పరిధిలోని కస్తానుపాలెం సాయిబాబు గుడి వద్ద జరిగిన రోడ్డు ప్రమాదంలో యువకుడు అక్కడికి అక్కడే మృతి చెందాడు అవనిగడ్డ మండల పరిధిలోని పులిగడ్డ గ్రామానికి చెందిన చిలపర్తి దినేష్ (30)%o/శీ% రాజు బుధవారం మధ్యాహ్నం పులిగడ్డ నుండి చల్లపల్లి వెళుతుండగా చల్లపల్లి వైపు నుండి మోపిదేవి వైపు వస్తున్న లారీ దినేష్ బైకును ఢీకొనడంతో దినేష్ అక్కడికక్కడే మృతి చెందాడు దినేష్ తండ్రి పులిగడ్డ పంచాయితీ ఎదురుగా వెల్డింగ్ షాప్ పెట్టుకొని జీవనం కొనసాగిస్తున్నారు రాజుకు ఇరువురు కుమార్తెలుతో పాటు దినేష్ కుమారుడు కాగా గత సంవత్సరం దినేష్ భార్య మృతి చెందినది బుధవారం దినేష్ మృతి చెందడంతో పులి గడ్డలో విషాదఛాయలు అలుముకున్నాయి ఈ సంఘటనపై చల్లపల్లి పోలీసులు కేసు నమోదు చేసి దినేష్ మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం అవనిగడ్డ ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు సంఘటన తెలుసుకున్న రాజు బంధువులు ఆసుపత్రికి చేరుకొని పెడుతున్న ఆర్తనాదాలు పలువురికి కంటతడి పెట్టించాయి.

# యోగా విజేతల స్ఫూర్తి.. యోగాంధ్ర దీప్తి

● ఘనంగా రాష్ట్రస్థాయి యోగా పోటీల విజేతలకు బహుమతుల ప్రదానోత్సవం ● 15 కేటగిరీల పోటీల్లోని 193 మంది విజేతలకు సత్కారం ● మాసోత్సవాల ఐక్యతా రాగంతో ప్రజలందరి హృదయాల్లో యోగా ముద్ర ● యోగా జీవన విధానంలో అంతర్భాగం కావాలనేదే యోగాంధ్ర లక్ష్యం ● గౌరవ ప్రధాని, గౌరవ ముఖ్యమంత్రి కృషితో యోగాకు విశేష ప్రాచుర్యం ● రాష్ట్ర పర్యాటక ప్రాంతాల ఔన్నత్యమూ సరిహద్దులు దాటింది ● వైద్య పర్యాటకాన్నీ పెద్దఎత్తున ప్రోత్సహించనున్న ప్రభుత్వం ● రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్ ● థీమాటిక్ ఫ్లోటింగ్ యోగాలో ప్రపంచ రికార్డు సాధించిన ఎన్టీఆర్ జిల్లాకు ప్రత్యేక అభినందనలు తెలియజేసిన మంత్రి






**విజయవాడ,కలంకౌంటర్ :** భారతదేశానికి మాత్రమే సొంతమైన అద్భుతమైన, సాంస్కృతిక వారసత్వ సంపదను ప్రతిఒక్కరికీ చేరువచేసి ప్రజల జీవన విధానంలో యోగాను అంతర్భాగం చేసుకునేలా అవగాహన కల్పించేందుకు, ప్రోత్సహించేందుకు యోగాంధ్ర మాసోత్సవాలను ప్రభుత్వం నిర్వహిస్తోందని, యోగా పోటీల్లో విజేతలుగా నిలిచిన వారి స్ఫూర్తి, యోగా విశిష్టతను మున్ముందుకు తీసుకెళ్లే దిక్సూచి అని రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్ అన్నారు. బుధవారం నగరంలోని తుమ్మలపల్లి క్షేత్రయ్య కళాక్షేత్రంలో 11వ అంతర్జాతీయ యోగా దినోత్సవ రాష్ట్రస్థాయి యోగా పోటీల విజేతలకు బహుమతుల ప్రదానోత్సవ కార్యక్రమం ఘనంగా జరిగింది. ఇబ్రహీంపట్నం మండలం, గుంటుపల్లి డాన్‌బాస్కో స్కూల్‌లో ఈ నెల 16, 17, 18వ తేదీల్లో జరిగిన రాష్ట్రస్థాయి పోటీల్లో 15 కేటగిరీల్లో 42 అంశాల్లో 526 మంది పాల్గొనగా 193 మంది విజేతలుగా నిలిచారు. ఆసనాల ప్రదర్శన, సూర్య నమస్కారాల ఛాలెంజ్, కళాత్మక యోగా, యోగా సాంగ్, యోగా పెయింటింగ్, యోగా స్కిట్, యోగా క్విజ్, యోగా ఎస్సే, యోగా షార్ట్ ఫిల్మ్, యోగా ఫొటోగ్రఫీ ఇలా వివిధ అంశాల్లో జరిగిన పోటీల్లో రాష్ట్రం నలుమూల నుంచి పాల్గొని విజేతలుగా నిలిచిన వారికి రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్, పర్యాటకం, సాంస్కృతిక, సినిమాటోగ్రఫీ శాఖ మంత్రి కందుల దుర్గేష్.. ఆయుష్ డైరెక్టర్ కె.దినేష్ కుమార్, సెకండరీ హెల్త్ డైరెక్టర్ ఎ.సిరి, జిల్లా కలెక్టర్ డా. జి.లక్ష్మీశ, జాయింట్ కలెక్టర్ ఎస్.ఇలక్కియ తదితరులతో కలిసి బహుమతులు అందజేసి, అభినందనలు తెలిపారు. ఈ సందర్భంగా మంత్రి సత్యకుమార్ యాదవ్ మాట్లాడుతూ గ్రామ, మండల, జిల్లా, చివరిగా రాష్ట్ర స్థాయిలో పోటీల్లో పాల్గొని విజేతలుగా నిలిచిన ప్రతిఒక్కరికీ అభినందనలు తెలియజేస్తున్నానని.. రాష్ట్రస్థాయి పోటీల్లో 38 మంది అల్లూరి సీతారామరాజు, పార్వతీపురం మన్యం జిల్లాల నుంచే ఉన్నారని.. అత్యంత పారదర్శకంగా పోటీలు నిర్వహించినట్లు పేర్కొన్నారు. గౌరవ ప్రధాని కృషితో నేడు యోగా ప్రపంచంలో దాదాపు 175 దేశాలకు చేరువైందని, కెనడాలో జీ7 శిఖరాగ్ర సదస్సులో తీరికలేకున్నా గౌరవ ప్రధానమంత్రి అంతర్జాతీయ యోగా దినోత్సవంలో పెద్దఎత్తున ప్రజలు పాల్గొనలాంటూ పిలుపునిచ్చారంటే ఆయన తపన అర్థమవుతోందన్నారు. గౌరవ రాష్ట్ర ముఖ్యమంత్రి మరో అడుగు ముందుకేసి నభూతో నభవిష్యతి తీరుగా యోగాంధ్ర మాసోత్సవాలను అత్యంత ప్రతిష్టాత్మకంగా నిర్వహించి, యోగాకు విశేష ప్రాచుర్యం కల్పిస్తున్నారన్నారు. రెండు కోట్ల మంది రిజిస్ట్రేషన్లను లక్ష్యంగా చేసుకుంటే ఏకంగా అది రెండు కోట్ల 30 లక్షలకు చేరిందని వివరించారు. యోగాంధ్రలో భాగంగా 103 పర్యాటక ప్రాంతాల్లోనూ ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహించి, ఆయా ప్రదేశాల ఔన్నత్యాన్ని ప్రపంచ దేశాలకు చాటిచెప్పామని, వైద్య పర్యాటకాన్ని కూడా పెద్దఎత్తున ప్రోత్సహించనున్నట్లు వెల్లడించారు. వికసిత్ భారత్, స్వర్ణాంధ్ర సాకారానికి, ప్రపంచ ఆర్థిక వ్యవస్థలో భారత్‌ను నెం.1గా నిలిపేందుకు యోగా అద్భుతమైన మార్గం వేస్తుందనడంలో సందేహం లేదని మంత్రి పేర్కొన్నారు. యోగాంధ్ర కార్యక్రమాలను వినూత్నంగా నిర్వహిస్తూ ఎన్టీఆర్ కలెక్టర్ డా. జి.లక్ష్మీశ నేతృత్వంలోని జిల్లా అధికార యంత్రాంగం థీమాటిక్ ఫ్లోటింగ్ యోగా ప్రపంచ రికార్డు సాధించినందుకు గర్వంగా ఉందని, ఇందులో భాగస్వాములైన ప్రతిఒక్కరికీ అభినందనలు తెలియజేస్తున్నట్లు తెలిపారు.

**యోగాంధ్ర.. ఓ గొప్ప క్రతువు: మంత్రివర్యులు కందుల దుర్గేష్:** యోగాంధ్ర మాసోత్సవాలు ఓ గొప్ప క్రతువని.. ఒక్క రోజుకే పరిమితం చేయకుండా యోగా గొప్పతనాన్ని ప్రజలందరికీ వివరించి, అన్ని వర్గాల ప్రజల జీవితంలో భాగం చేసుకునేలా రాష్ట్ర ప్రభుత్వం కార్యక్రమాలు నిర్వహించడం జరుగుతోందని రాష్ట్ర పర్యాటక, సాంస్కృతిక, సినిమాటోగ్రఫీ శాఖ మంత్రి కందుల దుర్గేష్ అన్నారు. మానసిక ప్రశాంతత ఉంటే చేసే పని ఏదైనా మంచి ఫలితాలు వస్తాయని.. శారీరక ఆరోగ్యంతో పాటు మానసిక ఆరోగ్యం యోగాతో సొంతమవుతుందన్నారు. భవిష్యత్తు బంగారుమయం కావడానికి యోగా దోహదపడుతుందనడంలో ఎలాంటి సందేహం లేదన్నారు. ఐరోపా దేశాల్లో సైతం మన భారతీయ యోగా, వెల్‌నెస్‌కు మంచి పేరుందని.. ఇటీవల తన పర్యటనలో గుర్తించినట్లు మంత్రివర్యులు తెలిపారు. గౌరవ ప్రధాని యోగాలో విశ్వగురు అని పేర్కొన్నారు. ఆయుష్ డైరెక్టర్ కె.దినేష్ కుమార్ మాట్లాడుతూ గౌరవ ముఖ్యమంత్రి ఆదేశాలతో కష్టమైనా సరే చాలా ఇష్టంతో యోగా పోటీలు నిర్వహించామని.. జూనియర్, యంగ్, సీనియర్ విభాగాల్లో పోటీలు నిర్వహించినట్లు తెలిపారు. నాలుగు లక్షల మందికిపైగా గ్రామస్థాయిలో పాల్గొనగా.. రాష్ట్రస్థాయి పోటీలకు 526 మంది అర్హత సాధించగా, 193 మంది విజేతలుగా నిలిచారన్నారు. ఈ నెల 21న విశాఖలో జరిగే అంతర్జాతీయ యోగా దినోత్సవంలో గౌరవ ప్రధానితో కలిసి ఆసనాలు వేసే కార్యక్రమంలో విజేతలు పాల్గొంటారన్నారు. నేడు విజేతలుగా నిలిచిన వారు యోగాను మున్ముందుకు తీసుకెళ్లేందుకు టార్చ్ బేరర్స్ అని, ఇది ఆరంభం మాత్రమేనని పేర్కొన్నారు. ఇదేవిధంగా రాష్ట్ర వ్యాప్తంగా యోగా పోటీలు నిర్వహించిన విధానాన్ని సెకండరీ హెల్త్ డైరెక్టర్ ఎ.సిరి వివరించారు.

**ఇది ఈవెంట్ కాదు.. మూవ్‌మెంట్: కలెక్టర్ డా. జి.లక్ష్మీశ..** యోగాంధ్ర అనేది ఒక ఈవెంట్ కాదని.. ఓ గొప్ప ఉద్యమం అని గౌరవ ప్రధాని, గౌరవ ముఖ్యమంత్రి స్ఫూర్తితో యోగా ప్రతిఒక్కరికీ చేరువవుతోందని ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ డా. జి.లక్ష్మీశ అన్నారు. రాష్ట్రంలోని మూలమూలకూ యోగా చేరువైందని, ప్రతిఒక్కరిలో యోగా ముద్ర పడిందని పేర్కొన్నారు. కళాత్మక యోగాతో యోగా గొప్పదనాన్ని చాటిచెప్పేందుకు నిర్వహించిన పోటీల్లో భాగంగా రాష్ట్రస్థాయి పోటీలు జిల్లాలో నిర్వహించడం జిల్లాకు గర్వకారణమని కలెక్టర్ లక్ష్మీశ పేర్కొన్నారు. కార్యక్రమంలో విజయవాడ ఆర్డీవో కావూరి చైతన్య, డీఎంహెచ్‌వో డా. ఎం.సుహాసిని, విజయవాడ నగరపాలక సంస్థ అదనపు కమిషనర్ డా. డి.చంద్రశేఖర్, ఆయుష్ అధికారులు డా. వి.రాణి, డా. రామతేహి, డా. రత్నప్రియదర్శిని తదితరులు పాల్గొన్నారు. విజేతలు, వారి తల్లిదండ్రులు పాల్గొన్నారు.

**వీర సైనికుల త్యాగాల స్మరణలో..** ఆపరేషన్ సిందూర్‌లో ప్రాణత్యాగం చేసిన వీర సైనికుల త్యాగాలను స్మరించుకుంటూ కార్యక్రమంలో రెండు నిమిషాల మౌనం పాటించారు. అమరావతి యోగా అండ్ ఏరోబిక్స్ ఆధ్వర్యంలో ఆపరేషన్ సిందూర్ నేపథ్యంతో సాగిన కళాత్మక ప్రదర్శన ప్రేక్షకుల్లో దేశభక్తి స్ఫూర్తిని నింపింది. మన వీర సైనికుల పోరాట పటిమ, దేశం కోసం ప్రాణాలర్పించిన సైనికుల త్యాగాలను గుర్తుచేస్తూ సాగిన ప్రదర్శన ప్రతిఒక్కరి మనసులను కదిలించింది. కార్యక్రమంలో భాగంగా ప్రజ్ఞా యోగా - ఆర్ట్ ఆఫ్ లివింగ్ ప్రదర్శనతో పాటు విద్యార్థుల సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి.

# బైబిల్ మీద ప్రమాణం చేసి చెప్తున్న..ఫోన్ ట్యాపింగ్ పచ్చి నిజం

● ఫోన్ ట్యాప్ జరిగినట్లు స్వయంగా వైవీ సుబ్బారెడ్డి నిర్ధారించారు ● వైఎస్ షర్మిలా రెడ్డి ఏపీసీసీ చీఫ్



**విశాఖపట్నం,కలంకౌంటర్ :** నా ఫోన్, నా భర్త ఫోన్, నా దగ్గరి వాళ్ళ ఫోన్లు లు ట్యాప్ చేశారు ఫోన్ ట్యాపింగ్ అయ్యింది అనేది ముమ్మాటికి పచ్చి నిజం ఆనాడు కేసీఆర్, జగన్ మధ్య మంచి అవినాభావ సంబంధం ఉండేది ఒకరికి ఒకరు అన్నట్లుగా ఉండేవాళ్ళు వీళ్ల సంబంధం ముందు రక్త సంబంధం చిన్నబోయింది ఇద్దరు ముఖ్యమంత్రులు కలిసి చేసిన జాయింట్ ఆపరేషన్ నా ఫోన్ ట్యాప్ అయినట్లు నాకు స్వయంగా వైవీ సుబ్బారెడ్డి చెప్పారు వైవీ సుబ్బారెడ్డి ఆనాడే నిర్ధారించారు అప్పుడు వైవీ సుబ్బారెడ్డి మా ఇంటికి వచ్చారు నా ఫోన్ ట్యాప్ అవుతున్నట్లు చెప్పారు ట్యాప్ చేసిన ఒక ఆడియో నాకు స్వయంగా వినిపించారు ఇప్పుడు సుబ్బారెడ్డి ఒప్పుకుంటాడా..అంటే అనుమానమే ? జగన్ తన సొంత మేనల్లుడు,మేన కోడలు అస్థి కాజేసే అంశంలో సుబ్బారెడ్డి తో అబద్ధాలు చెప్పించాడు ఇలాంటి పరిస్థితిలో వైవీ సుబ్బారెడ్డి ఒప్పుకుంటాడు అనుకోను ఫోన్ ట్యాపింగ్ విషయంలో విచారణకు ఎక్కడికైనా వస్తా ఏ విచారణను అయినా ఎదుర్కొంట బైబిల్ మీద ప్రమాణం చేసి ఫోన్ ట్యాపింగ్ జరిగినట్లు నేను చెప్పగలను ఫోన్ ట్యాపింగ్ జరిగినట్లు తెలిస్తే మీరు ఏం చేశారు అని నన్ను అడగొచ్చు ఇది అక్రమం,అనైతికం కదా అని నన్ను అడగొచ్చు స్వయంగా మీ ఇంట్లో మీరు వింటే ఎందుకు మౌనంగా ఉన్నారు అని అడగొచ్చు అన్నాడు ఉన్న పరిస్థితులు వేరు - అప్పుడు జగన్, కేసీఆర్ చేసినవి అరాచకాలు వీరి అరాచకాలతో పోలిస్తే ఫోన్ ట్యాపింగ్ చిన్నది నేను జగన్ కి తోడబుట్టిన చెల్లెలు ఆ విషయం మరిచి నేను ఆర్థికంగా, రాజకీయంగా ఎదగకూడదు అని కుట్ర నా భవిష్యత్ ను పాతిపెట్టాలని ఎన్నో చేశారు ఇందులో భాగంగానే ఫోన్ ట్యాపింగ్ కుట్ర నాకు సపోర్ట్ చేసిన వాళ్లను బెదిరించారు రాజకీయంగా నా వాళ్ళు రానివ్వకుండా చేశారు నా అనుచరులను భయభ్రాంతులకు గురి చేశారు నేను ఊపిరి తీసుకోవడమే కష్టం చేశారు నేను తెలంగాణలో పార్టీ పెట్టడం జగన్ కి ఏ సంబంధం లేదు కేసీఆర్ కోసం నన్ను తొక్కి పెట్టాలని చూశాడు నా చుట్టూ పరిస్థితులను కష్టతరం చేశాడు నా సర్వైవల్ కోసం నేను పోరాటం చేశా నా ప్రతి పోరాటానికి అడ్డు పడ్డారు ఫోన్ ట్యాపింగ్ జరిగింది వాస్తవం ముమ్మాటికి నిజం అనాడు ఉన్న ప్రభుత్వాలు ఇప్పుడు లేవు ఇప్పుడు ఇక్కడ చంద్రబాబు అధికారంలో ఉన్నారు..అక్కడ రేవంత్ రెడ్డి ఉన్నారు ఫోన్ ట్యాపింగ్ మీద చర్యలు తీసుకోవాలి ఎక్కడకు పిలిస్తే అక్కడకు వస్తా నేను కేసు పెట్టాలి అనుకుంటే అప్పుడే పెట్టే దాన్ని నాకు పర్సనల్ గజ్ అంటూ ఏమి లేదు నా మీద జగన్ కేసు వేసినప్పుడే నేను కేసు వేసే దాన్ని అమ్మకు ఇచ్చిన ఆస్తి విషయంలో కేసు వేసినప్పుడే నేను కేసు వేసే దాన్ని రెండు రాష్ట్రాల ప్రభుత్వాలు ఫోన్ ట్యాపింగ్ విషయంలో దర్యాప్తు ముమ్మరం చేయాలి.

# పల్నాడు జిల్లా రెంటపాళ్లలో మాజీ సీఎం జగన్ పర్యటన

(మొదటి పేజీ తరువాయి)

ఆయన నేరుగా గుంటూరులోని తన సోదరుడి ఇంటికి వెళ్లారు. అక్కడి నుంచి తన తండ్రి వెంకటేశ్వరరావుకు ఫోన్ చేసి, పోలీసులు తనను బెదిరించిన తీరును వివరించారు. పోలీసుల వేధింపుల వల్లే నాగమల్లేశ్వరరావు ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డారు. తండ్రి ఎంత ప్రయత్నించినా కుమారుడిని కాపాడుకోలేకపోయారు" అని జగన్ ఆవేదనగా చెప్పారు.

**"రెడ్ బుక్ రాజ్యాంగం నడుస్తోంది..** రాష్ట్రంలో అభివృద్ధి గానీ, సంక్షేమం గానీ కనిపించడం లేదని, కేవలం 'రెడ్ బుక్ రాజ్యాంగం' మాత్రమే అమలవుతోందని జగన్ విమర్శించారు. "రాష్ట్రంలో దారుణమైన పరిస్థితులు ఉన్నాయనడానికి ఈ ఆంక్షలే నిదర్శనం. ఎన్నికల ఫలితాల సమయంలో తమకు అనుకూలమైన పోలీసు అధికారులను నియమించుకుని, కూటమిని గెలిపించుకోవడానికి అనేక అన్యాయాలకు పాల్పడ్డారు. ఈ విషయం ఈ ప్రాంత ప్రజలందరికీ తెలుసు" అని అన్నారు. నాగమల్లేశ్వరరావు ఇంటిపై దాడి చేసిన వారిపై ఎలాంటి చర్యలు తీసుకోలేదని, ఆయన తండ్రి వెంకటేశ్వరరావు ఫిర్యాదు చేసినా పోలీసులు పట్టించుకోలేదని జగన్ ఆరోపించారు. "నాగమల్లేశ్వరరావును బెదిరించిన ఆ సీఐపై ముఖ్యమంత్రి చంద్రబాబు ఇప్పటివరకు ఎలాంటి చర్యలు తీసుకున్నారు? భార్య, కుమార్తె ఉన్న నాగమల్లేశ్వరరావు కుటుంబానికి చంద్రబాబు ఏం సమాధానం చెబుతారు? ఘటన జరిగి ఏడాది గడిచినా ఆ కుటుంబం ఇంకా శోకంలోనే ఉంది" అని జగన్ ప్రశ్నించారు. ఇదే నియోజకవర్గంలో లక్ష్మీనారాయణ అనే మరో వైఎస్సార్‌సీపీ కార్యకర్త కూడా పోలీసుల వేధింపులు భరించలేక పురుగుల మందు తాగి ఆత్మహత్యకు యత్నించాడని, ప్రస్తుతం ఆయన చావుబతుకుల మధ్య ఉన్నాడని జగన్ ఆవేదన వ్యక్తం చేశారు.

# పదవీ విరమణ శుభాకాంక్షలు







**అమరావతి,కలంకౌంటర్ :** ఆంధ్రప్రదేశ్ హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ కృపా సాగర్ ని మర్యాద పూర్వకంగా కలిసి పదవీ విరమణ శుభాకాంక్షలు తెలిపిన హైకోర్టు న్యాయవాదుల బృందం.

# రేపే మెగా జాబ్ మేళా



**అవనిగడ్డ,కలంకౌంటర్ :** అవనిగడ్డ ప్రభుత్వడిగ్రీ కళాశాల ఆవరణలో ఈనెల 20 వ తేదీ శుక్రవారం మెగా జాబ్ మేళా నిర్వహించనున్నట్లు క్లిన్ కారా ఫౌండేషన్ మేనేజింగ్ డైరెక్టర్ గుడివాక లక్ష్మీ గురువారం నాడు విలేకరులకుతెలిపారు. ఆమె విలేకరులతో మాట్లాడుతూ అవనిగడ్డ నియోజకవర్గంలోని నిరుద్యోగ యువతకు ఉపాధి అవకాశాలు కల్పించాలనే ధ్యేయంతో ఈ మెగా జాబ్ మేళా ఏర్పాటు చేస్తున్నామని, ఈ జాబ్ మేళాలో వివిధ కంపెనీల్లో మేనేజర్, రిటైల్ సేల్స్ ఆఫీసర్, డేటా ఎంట్రీ ఆపరేటర్, టెక్నీషియన్, కెమిస్ట్, తదితర ఉద్యోగాలకు ఇంటర్వ్యూలు నిర్వహిస్తారన్నారు. ఎస్ఎస్‌సీ, ఇంటర్, ఐటీఐ, డిప్లమో, డిగ్రీ, బీటెక్ ఉత్తీర్ణులైన 35 ఏళ్లలోపు అభ్యర్థులు అర్హులన్నారు. శుక్రవారం ఉదయం అవనిగడ్డ నియోజకవర్గ శాసనసభ్యులు మండలి బుద్ధప్రసాద్ జాబ్ మేళా ను ప్రారంభిస్తారని, ఉదయం 10 గంటల నుండి సాయంత్రం 5 గంటల వరకు ఇంటర్వ్యూలు కొనసాగుతాయని గుడివాక లక్ష్మీ తెలిపారు. ఆసక్తి గల అభ్యర్థులు 9014333335 నంబర్ ని సంప్రదించాల్సిందిగా కోరారు.

# రాష్ట్ర కల్చరల్ వింగ్ అధికార ప్రతినిధిగా వల్లూరి కోటేశ్వరరావు



**కందుకూరు, కలంకౌంటర్ :** వైయస్సార్సీపి అనుబంధ విభాగం కల్చరల్ విభాగం లో రాష్ట్ర అధికార ప్రతినిధిగా కందుకూరు పట్టణానికి చెందిన వల్లూరి కోటేశ్వరరావును నియమిస్తూ బుధవారం కేంద్ర కార్యాలయం ఒక ప్రకటన విడుదల చేసింది. తనకి రాష్ట్ర కల్చరల్ అధికార ప్రతినిధిగా నియమించడం పట్ల పార్టీ అధ్యక్షులు వైయస్ జగన్మోహన్ రెడ్డికి, కందుకూరు వైఎస్ఆర్సిపి ఇన్చార్జి బుర్ర మధుసూదన్ యాదవ్ కి కోటేశ్వరరావు ధన్యవాదాలు తెలిపారు. కల్చరల్ అధికార ప్రతినిధిగా కోటేశ్వరరావు నియమించడం పట్ల వారి మిత్రులు, బంధువులు, వైఎస్ఆర్ సీపీ నాయకులు శుభాకాంక్షలు తెలిపారు.

# అభివృద్దే అందరి అజెండా కావాలి - ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు

- ప్రజలకు అవసరమైన అన్ని అభివృద్ధి పనులు చేపడదాం - మేయర్ డాక్టర్ శిరీష
- అన్ని వార్డుల్లో అభివృద్ధి పనులు చేపడుతున్నాం - కమిషనర్ ఎన్.మౌర్య తిరుపతి నగరపాలక సంస్థ









**తిరుపతి,కలంకౌంటర్ :** నగరంలోని అన్ని వార్డుల్లో అభివృద్ధి, ప్రజలకు అవసరమైన సౌకర్యాలు కల్పించడమే మనందరి అజెండాగా ముందుకు నడుద్దామని ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు కార్పొరేటర్లకు, అధికారులకు పిలుపునిచ్చారు. తిరుపతి మునిసిపల్ కార్పొరేషన్ కౌన్సిల్ సాధారణ సమా వేశం బుధవారం ఎస్వీ యూనివర్సిటీ సెనేట్ హాల్ నందు మేయర్ డాక్టర్ శిరీష అధ్యక్షతన జరగగా కమిషనర్ ఎన్.మౌర్య అజెండాను ప్రవేశ పెట్టారు. కౌన్సిల్ సమావేశానికి ప్రత్యేక ఆహ్వానితులుగా తిరుపతి ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు, ఎం.ఎల్.సి. సిపాయి సుబ్రమణ్యం హాజరయ్యారు. డిప్యూటీ మేయర్లు ముద్ర నారాయణ, ఆర్.సి. మునికృష్ణ, కార్పొరేటర్లు, అధికారులు పాల్గొని పలు అంశాలపై చర్చించి అభివృద్ధి పనులకు ఆమోదం తెలిపారు. నగరంలోని ప్రజలకు ఆహ్లాదాన్ని అందిస్తున్న ప్రకాశం పార్కు, వినాయక సాగర్ నిర్వహణకు కావలసిన నిధుల మంజూరుకు ఆమోదం తెలిపారు. వర్షాల నేపథ్యం లో నగరంలోని ప్రధాన కాలువల్లో చెత్త, మట్టి తొలగించేందుకు, ఆయా వార్డుల్లో కమిషనర్ పర్యటనలో వచ్చిన సమస్యలు, కార్పొరేటర్ల వినతి మేరకు సి.సి.రోడ్ల ఏర్పాటుకు, డ్రైనేజీ కాలువల నిర్మాణానికి, వర్షపు నీరు సజావుగా వెళ్లేందుకు కాలువల నిర్మాణానికి, అధికారుల అద్దె వాహనాలకు, వీధి దీపాల విభాగంలో ఔట్ సోర్సింగ్ పై పని చేస్తున్న 38 మందికి మూడు వేల రూపాయల వంతున అదనంగా ఇచ్చేందుకు ఆమోదం తెలిపారు. సిటీ ఆపరేషన్ సెంటర్ నిర్మాణం నిధుల కొరకు నగరంలోని బస్టాండ్ సమీపంలోని మున్సిపల్ స్థలం విక్రయం వాయిదా వేశారు, అలాగే హెల్త్ అసిస్టెంట్ పోస్టుల వ్యవహారం కోర్టులో ఉన్నందున రెండు అంశాలను వాయిదా వేశారు. ఎమ్మెల్యే మాట్లాడు తూ స్మార్ట్ సిటీ నిధులతో చేపట్టిన సిటీ ఆపరేషన్ సెంటర్ భవనం నిధుల లేక ఆగిపోయిందని, మున్సిపల్ కార్పోరేషన్ కు సంబంధించి నిరుపయోగంగా ఉన్న స్థలాలను విక్రయించి పూర్తి చేయాలని ప్రభుత్వం ఆదేశించిందని తెలిపారు. ఈ మేరకు నిరుపయోగంగా ఉన్న బస్టాండ్ సమీపంలోని మున్సిపల్ స్థలాన్ని విక్రయించి పెండింగ్ లో ఉన్న నలభై శాతం పనులు పూర్తి చేసి పరిపాలన భవనాన్ని అందుబాటులోకి తీసుకురావాలని నిర్ణయించారని ఆయన చెప్పారు. అయితే మున్సిపల్ స్థలం అమ్మకం ప్రతిపాదన సాధ్యాసాధ్యాలు, ప్రత్యామ్నాయ మార్గాలపై ఓ కమిటీని ఏర్పాటు చేయాలని సూచించారు. ఈ కమిటీ పదిహేను రోజుల్లో నివేదిక సిద్ధం చేశాక మరోసారి కౌన్సిల్ సమావేశమై నిర్ణయం తీసుకుంటుందని ఆయన చెప్పారు. మేయర్ డాక్టర్ శిరీష మాట్లాడుతూ నగరంలోని ప్రజలకు అవసరమైన అన్ని సౌకర్యాలు కల్పించే అభివృద్ధి పనులు చేద్దామని అన్నారు. సి. ఓ.సి. భవనం నిర్మాణానికి కావలసిన నిధుల సేకరణకు స్థలాలు విక్రయించకుండా ప్రత్యామ్నాయ మార్గాలు చేపట్టాలని అన్నారు. కమిషనర్.మౌర్య మాట్లాడుతూ నగరంలో అన్ని వార్డుల్లో పర్యటించినప్పుడు వచ్చిన సమస్యలు, కార్పొరేటర్ల వినతుల మేరకు అభివృద్ధి పనులు చేపడుతున్నామని అన్నారు. ఇందుకు అందరూ సహకరించాలని అన్నారు. సిటీ ఆపరేషన్ సెంటర్ నిర్మాణం త్వరగా పూర్తి చేసేందుకు అందరి సహకారంతో ముందుకు వెళదామని అన్నారు.

# నేరాల నియంత్రణలో సీసీ కెమెరాల పాత్ర కీలకం

- జిల్లా కలెక్టర్ డాక్టర్.ఎస్.వెంకటేశ్వర్
- ప్రయాణికుల భద్రత, నేరాల నియంత్రణకు సీసీ కెమెరాలు ఎంతో దోహదపడతాయి
- జిల్లా ఎస్పీ వి హర్షవర్ధన్ రాజు
- 31 లక్షల రూపాయల విలువ చేసే 120 సీసీ కెమెరాలు అందజేసిన మెజర్స్ జెమినీ ఎడిబుల్ అండ్ ఫ్యాట్స్ ఇండియా లిమిటెడ్,హైదరాబాద్




**తిరుపతి, కలంకౌంటర్ :** నేరాల నియంత్రణలో సీసీ కెమెరాల పాత్ర కీలకమని జిల్లా కలెక్టర్ డాక్టర్.ఎస్.వెంకటేశ్వర్ తెలిపారు.బుధవారం సాయంత్రం స్థానిక అలిపిరి పోలీస్ స్టేషన్ సమీపంలోని హెూటల్ కేబీఆర్ లో ఏర్పాటు చేసిన సీసీ కెమెరాల ప్రారంభోత్సవ కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ, తిరుపతి లాంటి జిల్లాలో పోలీసింగ్ సాహసంతో కూడుకున్నదన్నారు. తిరుపతి సిటీలో 4.50 లక్షల జనాభాతో పాటు సుమారు ఒకటిన్నర లక్షల బయట ప్రాంత జనాభా ఉంటారన్నారు. మొత్తం ఆరు లక్షల మంది జనాభాను నియంత్రించాలంటే సాంకేతికతను ఉపయోగించుకోవాల్సి ఉందన్నారు. అందులో భాగంగానే నేడు మేజర్స్ జెమినీ ఎడిబుల్స్ అండ్ ఫ్యాట్స్ ఇండియా లిమిటెడ్ హైదరాబాద్ వారు సామాజిక బాధ్యత కార్యక్రమాల్లో భాగంగా 31 లక్షల రూపాయలు విలువ చేసే 120 అధునాతన టెక్నాలజీతో కూడిన కెమెరాలను పోలీస్ శాఖకు అందించడం శుభసూచకం అన్నారు. ఇందుకు నిధులు అందించిన ఫ్రీడమ్ ఆయిల్ సంస్థకు ఆయన అభినందనలు తెలియజేశారు. రియల్ టైం పోలీసింగ్, రియల్ టైం క్రైమ్ కంట్రోల్ అంశంలో సాంకేతికతను ఉపయోగించి చేపట్టాలని రాష్ట్ర ముఖ్యమంత్రి నిరంతరం తెలియజేస్తూ ఉంటారన్నారు. అట్టి సాంకేతికతను పోలీస్ శాఖ ఉపయోగించుకొని క్లిష్టతరమైన క్రైమ్ లను సీసీ కెమెరాల సహాయంతో ఛేదించడం, నిందితులను గుర్తించడం జరిగిందన్నారు. ప్రజలకు శాంతి భద్రతలు కల్పించడంలో పోలీస్ శాఖ అహర్నిశలు కష్టపడుతూ ఉంటుందని కలెక్టర్ తెలిపారు. సీసీటీవీలు ఏర్పాటు చేయడం వల్ల పోలీస్ వారు గమనిస్తూ ఉంటారన్న దృష్టితో నేరాలు తగ్గే అవకాశం ఉందన్నారు. గతంలో కూడా మానవ వనరులను తక్కువగా ఉపయోగించుకునేలా రాత్రి సమయాల్లో తిరుపతి నగరంలో డ్రోన్ ద్వారా ట్రాఫిక్ నియంత్రణ చేపట్టే చర్యలు పోలీస్ శాఖ చేసిందన్నారు. పోలీస్ శాఖకు అన్నివేళలా సహాయ సహకారాలు అందించేందుకు తాము సిద్ధంగా ఉంటామని కలెక్టర్ ఈ సందర్భంగా పేర్కొన్నారు.

**ప్రయాణికుల భద్రత, నేరాల నియంత్రణకు సీసీ కెమెరాలు ఎంతో దోహదపడతాయి - జిల్లా ఎస్పీ వి హర్షవర్ధన్ రాజు**

ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ మాట్లాడుతూ జీవకోనలోని 40 ప్రాంతాలలో 31 లక్షల రూపాయల విలువ చేసే120 అధునాతన సాంకేతికతో కూడిన సీసీ కెమెరాలను జెమిని ఎడిబుల్స్ అండ్ ఫ్లాట్స్ ఇండియా లిమిటెడ్ హైదరాబాద్ వారి సహకారంతో ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. ఇందుకు ఆ సంస్థకు ప్రత్యేకంగా కృతజ్ఞతలు తెలియజేస్తున్నా మన్నారు. వీరితో పాటు ఈ కెమెరాల ఏర్పాటుకు తోడ్పాటు అందించిన తిరుపతి చాంబర్ ఆఫ్ కామర్స్ ఎస్ అయ్యప్ప కు కూడా ఆయన కృతజ్ఞతలు తెలిపారు. ప్రశాంతమైన వాతావరణంలో జీవించాలంటే అసాంఘిక శక్తుల కాళ్లకు అడ్డుకట్ట వేయాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు.నేర నియంత్రణతో పాటు, నేరాలు జరిగినప్పుడు వాటిని కనిపెట్టడంలో సీసీ కెమెరాల పాత్ర ఎంతో కీలకంగా మారుతాయన్నారు. జీవకోన లాంటి ప్రాంతంలో చీమ చిటుక్కుటమన్న సమాచారం తెలిసే విధంగా సీసీ కెమెరాలు ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. అయితే ఆకతాయిల నుండి ఈ సీసీ కెమెరాలు కాపాడుకోవాల్సిన బాధ్యత స్థానిక ప్రజల పైనే ఉందన్నారు. అలాంటి వారి పట్ల ప్రజలు అప్రమత్తంగా వ్యవహరించి వెంటనే పోలీస్ నెంబర్ 112 కు సమాచారం ఇవ్వాల్సిందిగా విజ్ఞప్తి చేశారు. పోలీసు, రెవెన్యూ వ్యవస్థలు అనేక మంచి కార్యక్రమాలు నిర్వహిస్తూ ఉంటామన్నారు. తాము చేసే ప్రతి కార్యక్రమంలో ప్రజలు కూడా భాగస్వాములు కావలసిన అవసరం ఉందన్నారు. ఈ కార్యక్రమానికి జిల్లా కలెక్టర్ ని తాము ఆహ్వానించామని, తమ ఆహ్వానాన్ని మన్నించి ఈ కార్యక్రమ ప్రారంభోత్సవానికి విచ్చేసిన జిల్లా కలెక్టర్ కు జిల్లా ఎస్పీ ప్రత్యేక కృతజ్ఞతలు తెలియజేశారు. అంతేకాకుండా గతంలో డ్రోన్ కెమెరాలను, సోలార్ ఆధారిత కెమెరాలను తమ శాఖకు అందించడంలో జిల్లా కలెక్టర్ యొక్క పాత్ర ఎంతో ఉందని ఆయన ఈ సందర్భంగా తెలిపారు. చాలా తక్కువ వ్యవధిలో ఈ ప్రక్రియను కార్యరూపం దాల్చడంలో సహకరించిన జెమిని ఎడిబుల్స్ అండ్ ఫ్యాట్స్ఇండియా లిమిటెడ్ (ఫ్రీడమ్ ఆయిల్), హైదరాబాద్ సేల్స్ అండ్ మార్కెటింగ్ వైస్ ప్రెసిడెంట్ పి చంద్రశేఖర్ రెడ్డి కి జిల్లా ఎస్పీ ప్రత్యేక కృతజ్ఞతలు తెలియజేశారు. ఈ సందర్భంగా జెమిని ఎడిబుల్స్ అండ్ ఫ్యాట్స్ఇండియా లిమిటెడ్ (ఫ్రీడమ్ ఆయిల్), హైదరాబాద్ సేల్స్ అండ్ మార్కెటింగ్ వైస్ ప్రెసిడెంట్ పి చంద్రశేఖర్ రెడ్డి మాట్లాడుతూ, తమ సంస్థ గత 8 సంవత్సరాలుగా సామాజిక సేవలో పాల్గొంటున్నామని అందులో భాగంగానే తిరుపతి లాంటి పుణ్యక్షేత్రంలో తమ సంస్థ తరఫున సీసీ కెమెరాలు అందజేయడం చాలా సంతోషంగా ఉందన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా పోలీసు యంత్రాంగం తదితరులు పాల్గొన్నారు.

# పంట ఉత్పత్తుల్ని వాణిజ్య కోణంలోనే చూడాలి

- రైతులకు ఇబ్బంది కలగకుండా పంట ఉత్పత్తుల కొనుగోలు జరగాలి
- పంట వివరాలు, పర్యవేక్షణకు సాంకేతికత వినియోగించండి
- ప్రత్యేక పరిస్థితుల దృష్ట్యా రైతులకు అండగా నిలవాలి
- ఎగుమతులు పెంచేందుకు అత్యుత్తమ గ్రేడింగ్ విధానాలు అమలు చేయండి
- మామిడి, పొగాకు, కోకో పంటల మద్ధతు ధరలపై సమీక్షలో సీఎం చంద్రబాబు ఆదేశాలు

**అమరావతి,కలంకౌంటర్ :** పొగాకు, మామిడి తదితర పంట ఉత్పత్తులకు సంబంధించి నెలకొన్న ప్రత్యేక పరిస్థితుల దృష్ట్యా రైతులకు అండగా నిలవాల్సిన అవసరం ఉందని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు అన్నారు. పంట ఉత్పత్తులను వాణిజ్య కోణం లోనే చూడాలని, వీలైనంత మెరుగైన ధర వచ్చేలా చర్యలు తీసుకోవాలని అధికారులకు సూచించారు. సచివాలయంలో మామిడి, పొగాకు, కోకో పంటల మద్ధతు ధరతో పాటు వివిధ అంశాలపై ముఖ్యమంత్రి సమీక్షించారు. ఈ ఏడాది హెచ్డీ బర్లీ పొగాకు 80 మిలియన్ కేజీల మే-ర ఉత్పత్తి వచ్చిందని సమీక్షలో అధికారులు ముఖ్యమంత్రికి వివరించారు. ఇప్పటి వరకూ 27 మిలియన్ కేజీల మేర విక్రయాలు జరిగినట్టు అధికారులు తెలిపారు. మిగిలిన 53 మిలియన్ కేజీల హెచ్డీ బర్లి పొగాకును త్వరగా కొనుగోలు చేయాలని ముఖ్యమంత్రి ఆదేశించారు. ఇందులో 33 మిలియన్ కేజీల పొగాకును 24 కంపెనీల ద్వారా కొనుగోలు చేసేలా చర్యలు తీసుకున్నట్టు అధికారులు వివరించారు. మరో 20 మిలియన్ కేజీల మేర పొగాకును ఏపీ మార్క్ ఫెడ్ ద్వారా కొనుగోలుకు ఏర్పాట్లు చేసినట్టు సీఎంకు అధికారులు తెలిపారు. బాపట్ల -3, గుంటూరు2, పలనాడు -1, ప్రకాశం - 1 కొనుగోలు కేంద్రాలు ద్వారా పొగాకు కొనుగోలు కేంద్రాలు ప్రారంభించామని.. వీటి ద్వారా రేపటి నుంచే కొనుగోళ్లు ముమ్మరం చేస్తామని అధికారులు సీఎం దృష్టికి తెచ్చారు. కొనుగోళ్ల కేంద్రాల వివరాలను, సంబంధిత సమాచారాన్ని ప్రతీ పొగాకు రైతుకు అందివ్వాలని సీఎం ఆదేశించారు.

**ఎగుమతులు పెంచేందుకు అత్యుత్తమ గ్రేడింగ్ విధానాలు అమలు చేయండి..**

పామ్ ఆయిల్ పై సుంకం తగ్గింపు, మ్యాంగో పల్ప్ పై జీఎస్టీని 12 శాతం నుంచి 5 శాతానికి తగ్గించే అంశంపై ఇప్పటికే కేంద్రంతో మాట్లాడా నని ముఖ్యమంత్రి చంద్రబాబు స్పష్టం చేశారు. దీనిపై అధికారులు సంబంధిత కేంద్ర ప్రభుత్వ శాఖలతో సమన్వయం చేసుకోవాలని సూచించారు. మామిడి పంటకు సంబంధించి పంట ప్రణాళికపై రైతులకు ఎప్పటికప్పుడు అవగాహన కల్పించాలని సీఎం అధికారులకు సూచించారు.

# మంత్రి కి శుభాకాంక్షలు తెలిపిన ఇరుకుల్ల



**హైదరాబాద్,కలంకౌంటర్ :** తెలంగాణ రాష్ట్ర మైన్స్ కార్మికశాఖ మంత్రి గా బాధ్యతలు స్వీకరించిన గడ్డం వివేక్ వెంకటస్వామి కి హార్దిక శుభాకాంక్షలు తెలిపిన వాసవి క్లబ్స్ ఇంటర్నేషనల్ అధ్యక్షుడు ఇరుకుల్ల రామకృష్ణ తదితరులు.

# శవ రాజకీయాలు చేస్తున్న జగన్‌రెడ్డి

**-రాష్ట్ర టిడిపి అధికార ప్రతినిధి అర్వపల్లి అంజనేయులు**



**అమరావతి, కలంకౌంటర్ :** అరాచక శక్తుల ను ప్రోత్సహించడానికి జగన్ పర్యటనలు చేస్తున్నాడని, శవ రాజకీయాలు చేయటం జగన్‌కి అలవాటని రాష్ట్ర టిడిపి అధికార ప్రతినిధి అర్వపల్లి ఆంజనేయులు ద్వజమెత్తారు. జగన్ శవరాజకీయం చేయడానికి వెళ్లి ఒక మనిషిని శవంగా మార్చి వేశాడని జగన్ రాత్రి చంపి పొద్దున్నే దండ వేసే టైపని నాగమల్లేశ్వరావు చావు కి జగనే కారణమని రాజారెడ్డి రాజ్యాం గాన్ని జగన్ అమలు చేసాడని ఏ పార్టీ వ్యక్తిఅయినా చనిపోవటం బాధాకరంమని ఏడాది తర్వాత నానా హంగా మాచేస్తూ సత్తెనపల్లికి ఓదార్పు యాత్ర చేస్తున్న జగన్రెడ్డి జగన్ వైనాట్ 175 అని ఫేక్ పబ్లిసిటి ని నమ్మి బెట్టింగ్ కాసి అప్పుల పాలైన బెట్టింగ్ రాయుడు మల్లే శ్వరావుని ఏడాది క్రితం చని పోతే ఇప్పుడు శవ రాజకీయం చేస్తున్నాడని వైసిపి ఉప సర్పం చ్ మల్లేశ్వరరావు మరణానికి కూటమి ప్రభుత్వమే కారణం అంటు నానాయగిచేస్తున్నాడని మరి అతను చని పోయింది బెట్టింగ్ వల్లని అప్ప టికి జగనే అధికారంలో ఉన్నడని కూటమి అధికారం లోకి వచ్చింది 2024 జూన్12 నని మల్లేశ్వరరావు గడ్డి మందు తాగింది జూన్ 5 నని చనిపోయింది జూన్ 9 నని అన్నారు.




మధిర లో నూతన బస్ స్టేషన్ నిర్మాణానికి శంకుస్థాపన చేస్తున్న డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క, రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ రావు...
-మధిర,కలంకౌంటర్ :

# కసిత భారత్ సంకల్ప సభ




**గోకవరం( తూ. గో. జిల్లా),కలంకౌంటర్ :** మోదీ 11 సంవత్సరాలు సుపరిపాలనలో భాగంగా గోకవరం లో ఇనుకోటి బాపన్నాదొర అధ్యక్షతన జరిగిన వికసిత్ భరత్ సంకల్ప సభలో బీజేపీ జిల్లా అధ్యక్షులు బిక్కిన విశ్వేశరరావు, ముఖ్య వక్త గా బీజేపీ నాయుకులు యేనిమిరెడ్డి మాలకొండయ్య మాట్లాడుతూ మోడీ 11 సంవత్సరాల ప్రవేశపెట్టిన వివిధ పథకాల కోసం ప్రజలకు కార్యకర్తలకు క్షుణ్ణంగా వివరించడం జరిగింది .మిక్షిత్ భారత్ 2047 ప్రతిజ్ఞ చేశారు.ఈ కార్యక్రమంలో, మట్ట మంగరాజు , కంబాల శ్రీనివాసరావు గండి కొండలరావు, దాట్ల సూర్యనారాయణ రాజు , వరలబాబు శ్రీవాస్తవయా,సాధన, వెంకన్న,కాకి మణికంఠ వెంకన్నబాబు కోన సురేష్ ముక్క శ్రీను దొరబాబు ముప్పిడి నాగేశ్వరరావు రామకృష్ణ బీజేపీ నాయకులు కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

# మంచి ఓపిక, సహనం ఉన్న న్యాయమూర్తి జస్టిస్ డా. వి.ఆర్.కె.కృపాసాగర్

## - రాష్ట్ర ఉన్నత న్యాయ స్థానం చీఫ్ జస్టిస్ ధీరజ్ సింగ్ ఠాకూర్





**అమరావతి,కలంకౌంటర్** : మంచి ఓపిక, సహనం ఉన్న న్యాయమూర్తిగా జస్టిస్ డా.వి.ఆర్.కె.కృపాసాగర్ పేరుతెచ్చుకున్నారని రాష్ట్ర ఉన్నత న్యాయ స్థానం ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ ధీరజ్ సింగ్ ఠాకూర్ అభినందించారు. కేసుల వాదన విషయంలో ఇరు పార్టీలకు తమ వాదనను స్వేచ్ఛగా వినిపించుకునే అవకాశాన్ని కల్పించి న్యాయమైన, సంతృప్తికరమైన నిర్ణయాన్ని తీసుకోవడంలో వీరికి వీరే సాటన్నారు. ఆంధ్రప్రదేశ్ హైకోర్టులో న్యాయమూర్తిగా సేవలు అందజేస్తున్న జస్టిస్ డా.వి.ఆర్.కె. కృపాసాగర్ పదవీ విరమణ సందర్భంగా బుధవారం హైకోర్టు మొదటి కోర్టు హాల్లో ఘనంగా వీడ్కోలు కార్యక్రమం జరిగింది. ఈ వీడ్కోలు కార్యక్రమంలో హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ ధీరజ్ సింగ్ ఠాకూర్ మాట్లాడుతూ న్యాయమూర్తి జస్టిస్ డా.వి.ఆర్.కె.కృపాసాగర్ సేవలను కొనియాడారు. 1994 లో మునిసిఫ్ మెజిస్ట్రేట్ గా న్యాయ వ్యవస్థలో ప్రస్తానాన్ని ప్రారంభించి న్యాయ సేవలు అందించడంలో మంచి ప్రతిభ కనబరుస్తూ స్వయం కృషితో అంచలంచలుగా ఎదుగుతూ 2022 ఆగస్టు 4 న హైకోర్టు జడ్జి గా నియమించబడ్డారని అభినందించారు. వీరు వ్రాసిన పలు ఆర్టికల్స్ పలు లా జర్నల్స్ లో ప్రచురితమై యువ న్యాయవాదులకు మార్గదర్శకంగా నిలిచాయన్నారు. ఏ.పి. జ్యూడిషియల్ అకాడమీ బోర్డు గవర్నరుగానే కాకుండా పలు కమిటిల్లో వీరు సభ్యులుగా ఉంటూ న్యాయ వ్యవస్థకు ఉత్తమమైన సేవలు అందజేయడం వీరి ప్రతిభకు నిదర్శనమన్నారు. పరిపాలనా పరంగానే కాకుండా న్యాయవ్యవస్థ పరంగా ప్రముఖ సేవలు వీరు అందజేశారన్నారు. హైకోర్టు జడ్జిగా మూడేళ్ల పాటు సేవలు అందజేసిన వీరు విభిన్న అంశాలను పర్యవేక్షిస్తూ అంకిత భావంతో విధులనల నిర్వహిస్తూ పలు కేసులను కూడా పెద్ద ఎత్తున పరిష్కరించి న్యాయపరమైన అంశాల, చట్టాలపై వీరికి ఉన్న సమగ్ర అవగాహనను, పట్టును నిరూపించుకున్నారని ప్రశంసించారు. పదవీ విరమణ చేస్తున్న న్యాయమూర్తి డా.వి.ఆర్.కె. కృపాసాగర్ మాట్లాడుతూ న్యాయ అంశాలపై మంచి పట్టుతో అంకిత భావంతో విధులు నిర్వహించే తోటి న్యాయమూర్తులు తనకు మంచి ప్రేరణగా నిలిచారని, వారి స్ఫూర్తి, ప్రేరణతోనే న్యాయ మూర్తిగా తన విధులను విజయవంతంగా నిర్వహించడం జరిగిందన్నారు. సామాజిక విలువలు, ఆశయాలు, న్యాయ పరమైన అంశాలను పరిరక్షించే భాద్యత న్యాయమూర్తిపై ఉందని, ఆ కోణంలోనే ఇరు పక్షాల వాదనలను వింటూ న్యాయమైన, సంతృప్తి కరమైన తీర్పును వెలువరించాల్సి ఉంటుదని ఆయన అన్నారు. అందరి సహకారంతో నిజాయితీ, క్రమశిక్షణ మరియు బలమైన కర్తవ్య భావనతో న్యాయ వ్యస్థకు గణనీయమైన సేవలు అందజేయడం జరుగుచున్నదన్నారు. న్యాయ మూర్తి పదవి గౌరవాన్ని, ప్రతిష్టను ఇనుమడించే విధంగా విభిన్న మైన కేసులను పరిష్కరించి వాజ్యదారులకు సంతృప్తికరమైన సేవలను అందజేయడం జరిగిందన్నారు. ఇందుకు సహకరించిన ప్రతి ఒక్కరికీ ఆయన ధన్యవాదములు తెలిపారు. హైకోర్టు జడ్జిగా తన విధులను విజయవంతంగా నిర్వహించేందుకు సహకరించిన ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ ధీరజ్ సింగ్ ఠాకూర్ కు, న్యాయమూర్తులు, న్యాయవాదులు, న్యాయ వ్యవస్థ అధికారులు, సిబ్బంది ప్రతి ఒక్కరికీ ఆయన కృతజ్ఞతలు తెలిపారు. అడిషనల్ సొలిసిటర్ జనరల్ చల్లా ధనంజయ, అడ్వొకేట్ జనరల్ దమ్మలపాటి శ్రీనివాస్ , హైకోర్టు బార్ అసోసియేషన్ అధ్యక్షులు కె.చిదంబరం మాట్లాడుతూ జస్టిస్ డా.వి.ఆర్.కె. కృపాసాగర్ న్యాయ వ్యవస్థకు ఉత్తమమైన సేవలు అందించారని కొనియాడారు. అత్యంత నిరాడంబరంగా జరిగిన ఈవీడ్కోలు కార్యక్రమంలో పలువురు హైకోర్టు న్యాయ మూర్తులు, అదనపు అడ్వకేట్ జనరల్ ఇ.సాంబశివ ప్రతాప్, డిప్యూటీ సొలిసిటర్ జనరల్ పొన్నారావు , పబ్లిక్ ప్రాసిక్యూటర్ ఎం.లక్ష్మీనారాయణ, హైకోర్టు రిజిస్ట్రార్ జనరల్ పార్థసారధి, పలువురు ఇతర రిజిస్ట్రార్లు,సీనియర్ న్యాయవాదులు,బార్ అసోసియేషన్, బార్ కౌన్సిల్ సభ్యులు, హైకోర్టు ఉద్యోగుల సంఘం అధ్యక్షులు ఎ.వేణుగోపాలరావు , హైకోర్టు ఉద్యోగులు, ఎపి లీగల్ సర్వీసెస్ అథారిటీ, ఎపి జుడీషియల్ అకాడమీ ప్రతినిధులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

# ఇంటర్ విద్యార్థినికి ప్రోత్సాహం

## - లంకి శెట్టి బాలాజీ ఫ్రెండ్ సర్కిల్ ద్వారా లక్షా 58 వేల నగదు బహుమానం



**మచిలీపట్నం,కలంకౌంటర్** : చదువుకు చేయూతనిచ్చే కార్యక్రమం బుధవారం ప్రముఖ న్యాయవాది మచిలీపట్నం బార్ అసోసియేషన్ మాజీ అధ్యక్షులు లంకిశెట్టి బాలాజీ కార్యాలయంలో జరిగింది .ఇంటర్ విద్యార్థిని ని ప్రోత్సహిస్తూ లంకిశెట్టి బాలాజీ ఫ్రెండ్స్ సర్కిల్ ద్వారా 1,58, 000 రూపాయల నగదు అందజేశారు. మచిలీపట్నం లోని భాష్యం హైస్కూల్లో చదివిన చినముత్తేవి శ్రీలక్ష్మి నాగ మృదుల పదవ తరగతిలో 600 మార్కులకు గాను 591 మార్కులు సాధించింది.ప్రస్తుతం మృదుల విజయవాడ చైతన్య కాలేజీలో ఇంటర్మీడియట్ బైపిసి చదువుతుంది . ఇంటర్ మొదటి సంవత్సరంలో 440 మార్కులు గాను 430 మార్కులు సాధించింది. ప్రస్తుతం ఇంటర్ ద్వితీయ సంవత్సరానికి వచ్చిన ఆమెకు లంకి శెట్టి బాలాజీ ఫ్రెండ్ సర్కిల్ ద్వారా లక్షా 58 వేల రూపాయల నగదును బుధవారం సాయంత్రం అందజేశారు .గత ఏడాది ఇదే విద్యార్థినికి లక్షా 35 వేల రూపాయలు నగదు బహుమతిని బాలాజీ ప్రెండ్స్ సర్కిల్ ద్వారా అందచేయడం జరిగింది .ఈ సందర్భంగా న్యాయవాది లంకిశెట్టి బాలాజీ మాట్లాడుతూ డాక్టర్ కావాలనే లక్ష్యంతో విద్యనభ్యసిస్తున్న విద్యార్థిని మృదుల ఆశయం చాలా గొప్పదన్నారు .డాక్టర్ గా ఆర్మీలో సేవలందించాలనే ఆమె ఆశయం ఆదర్శనీయమన్నారు. ఆమె చదువుకు పేదరికం ఆటంకం కాకూడదనే ఉద్దేశంతో తమ సర్కిల్ ద్వారా ఈ ఆర్థిక సహాయాన్ని అందజేస్తున్నామన్నారు. రెండేళ్లుగా ఈ సహాయాన్ని అందించడం ఎంతో సంతోషంగా ఉందన్నారు. ఇందుకు సహకరించిన దాతలకు బాలాజీ ధన్యవాదాలు తెలిపారు .ముఖ్యంగా రిటైర్డ్ అడిషనల్ సూపరింటెండెంట్ ఆఫ్ పోలీస్ శాయన సుశీలరావు తన తల్లిదండ్రుల మీద ఏర్పాటు చేసిన సేవా సమితి ద్వారా విద్యార్థులకు చేస్తున్న సహాయం వెలకట్టలేనిదన్నారు. అదే స్ఫూర్తితో ఈ విద్యార్థికి 10 వేల రూపాయల ఆర్థిక సహాయం అందజేసిన సుశీలరావుకు ఆయన కృతజ్ఞతలు తెలిపారు. అనంతరం లంకిశెట్టి బాలాజీ ఫ్రెండ్స్ సర్కిల్ ద్వారా మృదులను ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో శాయన సుశీలరావు, ఎస్ బి ఐ రిటైర్డ్ ఏ.జీ. ఎల్.ఎస్.ఎస్ వి. డి హనుమంతరావు, ఎల్.సాయిబాబు ,సిహెచ్ ఆదినారాయణ ,విద్యార్థిని తండ్రి రవికుమార్ తదితరులు పాల్గొన్నారు.

# వికసిత్ భారత్



**పొన్నలూరు,కలంకౌంటర్** : ప్రకాశం జిల్లా పొన్నలూరు మండలంలో వికసిత్ భారత్ సంకల్ప సభ నరేంద్ర మోడీ 11 సంవత్సరాల సుపరిపాలన కార్యక్రమాన్ని SC మోర్చా జిల్లా అధ్యక్షులు పెరిక లక్ష్మణ్ ఆధ్వర్యంలో పొన్నలూరు జూనియర్ కాలేజీలో నిర్వహించారు. అదేవిధంగా ప్రపంచ పర్యావరణ దినోత్సవాన్ని పురస్క రించుకొని కాలేజ్ ఆవరణంలో అమ్మ కోసం మొక్కలు నాటా రు .ఈ కార్యక్ర మానికి ముఖ్య అతిధులుగా ప్రకాశం జిల్లా ఎస్సీ మోర్చా ఇంచార్జ్ పరుసు వెంకటేశ్వర్, ప్రకాశం జిల్లా మాజీ అధ్యక్షులు ప్రస్తుత బాపట్ల ఇంచార్జ్ కృష్ణారెడ్డి, నాగేంద్ర యాదవ్ అజయ్ శివకుమారి కుమారి,ప్రసాద్, మండల అధ్యక్షులు గోపి ఓబీసీ మోర్చా జిల్లా అధ్యక్షులు తానికొండ సురేష్ మాదాల నరేష్ తదితర నాయకులు పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు. ఈ కార్యక్రమాన్ని పొన్నలూరు మండల ప్రభుత్వ హైస్కూల్లో మొక్కలునాటారు. ఉద్దేశించి అక్కడ విద్యార్థి విద్యార్థినిలతో ప్రధానమంత్రి 11 సంవత్సరాల బిజెపి పరిపాలన లో పేద ప్రజల కోసం ప్రధానమంత్రి ప్రవేశపెట్టిన పథకాలు ఈ దేశంలో చేసినటువంటి అభివృద్ధి కార్యక్రమాల గురించి వివరించారు.

# విశాఖలో నిర్వహించే యోగా దినోత్సవం జయప్రదం చేయండి ఎమ్మెల్యే ఇంటూరి



**కందుకూరు, కలంకౌంటర్** : విశాఖలో జూన్ 21న 11వ అంతర్జాతీయ యోగా దినోత్సవం నిర్వహణ సందర్భంగా. యోగాంధ్ర కార్యక్రమం ఏర్పాట్లపై బుధవారం శృంగవరపుకోట నియోజకవర్గం లోని లక్కవరపుకోట మండలంలో నిర్వహించిన సమీక్షా సమావేశంలో రాష్ట్ర బిసి సంక్షేమ శాఖ మంత్రి ఎస్ సవిత తో కందుకూరు ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావు పాల్గొన్నారు. ఈ సమీక్ష సమావేశంలో శృంగారపు కోట శాసనసభ్యులు కోళ్ల లలిత కుమారి , ప్రజా ప్రతినిధులు, ప్రభుత్వ అధికారుల పాల్గొన్నారు.

# కొడాలి నాని అరెస్టు అని సామాజిక మాధ్యమాల్లో వస్తున్న వార్త అవాస్తవం

## - జిల్లా ఎస్పీ ఆర్. గంగాధరరావు



**మచిలీపట్నం,కలంకౌంటర్** : మాజీ మంత్రి కొడాలి నాని పై ఉన్న కేసుల నేపథ్యంలో కలకత్తా ఎయిర్పోర్ట్ నందు అరెస్టు చేశారంటూ సామాజిక మాధ్యమాల వేదికగా వస్తున్న వార్తలు అవాస్తవం. అలా ప్రచురితం అవుతున్న వార్తలలో ఏమాత్రం నిజం లేదని జిల్లా ఎస్పీ ఆర్ గంగాధరరావు తెలిపారు. ఒకవేళ ఆయనను అరెస్టు చేస్తే ఆ సమాచారాన్ని అధికారికంగా తెలియజేస్తాము . అంతేకానీ ఇలాంటి నిరాధారమైన వార్తలను సామాజిక మాధ్యమాలలో షేర్ చేసినా, పోస్ట్ చేసినా అటువంటి వారిపై చట్ట ప్రకారం కఠిన చర్యలు తీసుకుంటామని, ఇలాంటి చర్యలకు పాల్పడిన వారు ఎవరినైనా ఉపేక్షించేది లేదని జిల్లా ఎస్పీ హెచ్చరించారు.

# మహిళ మృతి కేసు కొట్టివేత

## - మచిలీపట్నం కోర్టు తీర్పు

**మచిలీపట్నం,కలంకౌంటర్** : ప్రేలుడు పదార్థాల వలన మహిళ మృతి చెందిందని మరో మహిళపై పెట్టిన కేసును కొట్టివేస్తూ మచిలీపట్నం రెండవ అదనపు జ్యుడీషియల్ ఫస్ట్ క్లాస్ మేజిస్ట్రేట్ ఎం. దేవస్థ దీపిక బుధవారం తీర్పు చెప్పారు..ఇన గుదురు పోలీస్ స్టేషన్ పరిధిలోని ఉలింగపాలెం చెందిన మహిళకు దీపావళి సామాన్లు తయారు నిమిత్తం కొజ్జిలిపేటకు చెందిన అంబుల హేమలత (45 )అనే మహిళ పేలుడు పదార్థాలను సరఫరా చేసిందని, మందుగుండు సామాగ్రి తయారీలో ప్రమాదం వశాత్తు జరిగిన ప్రమాదంలో మహిళ చనిపోవడానికి అంబుల హేమలత కారణమని 2020 డిసెంబర్ 11వ తారీఖున ఇనగుదురు పోలీసులు కేసు నమోదు చేశారు. ఈ కేసును అప్పటి సబ్ ఇన్స్పెక్టరు జి. వెంకటేశ్వర్ రెడ్డి దర్యాప్తు చేసి 16 మంది సాక్షులతో ఛార్జ్ షీట్ దాఖలు చేశారు. కేసు విచారణలో నిందితురాలు అంబుల హేమలతపై నేరం రుజువు చేయడానికి ప్రాసిక్యూషన్ తగిన సాక్ష్యాధారాలు ప్రవేశపెట్టలేకపోవడంతో కేసు కొట్టి వేస్తూ న్యాయమూర్తి తీర్పు చెప్పారు. ఈ కేసులో నిందితురాలు అంబుల హేమలత తరపున లంకిశెట్టి బాలాజీ న్యాయవాదిగా వ్యవహరించారు.












Printed,Published and owned by Chitta Vasavidevi Printed at Rama Offset Printers, 7th ward, Ponnuru, Guntur District-522 124 Andhra Pradesh and Published at 7th ward, Ayyappa Nagar, Ponnuru-522 124, Guntur District. Andhra Pradesh. Editor : Chitta Vasavidevi. RNI No.APTEL/2016/69464, Phone No.9346935672, kalamcounter@gmail.com